ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

అవగాహన కల్పిస్తున్న సీడీపీవో జానకి

కోటగిరి, ఫిబ్రవరి 22 : ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు సీడీపీవో జానకి అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కోటగిరి మండల పరిషత్ కార్యాలయంలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించగా.. ఆమె హాజరై మాట్లాడారు. ఆడపిల్లల కోసం రాజ్యాంగంలో ఉన్న రక్షణ చట్టాలు, మహిళల సంరక్షణ, వారి పురోగతికి తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. మహిళా సాధికారత కేంద్రం, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్తలు స్వప్న, రాంబాబు, బాలల పరిరక్షణ అధికారి నాగెల్లి బాబు, ఉపవైద్యాధికారిణి విద్య, కోటగిరి, పొతంగల్ మండలాల సూపర్‌వైజర్లు మణి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ భూమారెడ్డికి ఘననివాళి

సంతాపసభలో పాల్గొన్న వైద్యులు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 22 : ఛాతి వైద్య నిపుణుడు భూమారెడ్డి సంతాప సభను రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో ఐఎంఏ-నిజామాబాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వైద్యులు, ఆయన కుటుంబీకులు భూమారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 36 ఏండ్ల పాటు వైద్య సేవలందించారని కొనియాడారు.

ఫేర్‌వెల్ పార్టీకి డబ్బు వసూళ్లపై విచారణ

రుద్రూర్, ఫిబ్రవరి 22 : మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రెండు రోజుల క్రితం ఫేర్‌వెల్ పార్టీని నిర్వహించారు. ఈ పార్టీకి విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో శాంతకుమారి గురువారం విచారణ చేపట్టారు. ఫేర్‌వెల్ పార్టీని ఘనంగా నిర్వహిద్దామని ఎస్‌వోను కోరామని, తల్లిదండ్రుల అనుమతితోనే తమ ఇష్టపూర్వకంగా డబ్బులు ఇచ్చామని విద్యార్థులు చెప్పారని ఎంఈవో తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు రూ.800, 6 నుంచి 8 తరగతి వరకు రూ.300 చొప్పున ఇచ్చినట్లు విద్యార్థులు చెప్పారని వివరించారు. ఫేర్‌వెల్ పార్టీకి డబ్బుల వసూళ్లపై ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు, టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు తహసీల్దార్ వెంకటేశానికి గురువారం ఫిర్యాదు చేశారు.

వైభవంగా గరుడసేవ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని ఖిల్లా రామాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామి తిరుకల్యాణోత్సవాలు ప్రధాన అర్చకుడు సుమిత్ శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం స్వామివారికి గరుడోత్సవం నిర్వహించారు. గరుడ వాహనంపై గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, సభ్యులు గడ్డం నర్సారెడ్డి, సున్నం పోశెట్టి, సూర మాధురి, ఆసది జితేందర్, తాజా మాజీ సర్పంచ్ గడ్డం రాధాకృష్ణారెడ్డి, బూస సుదర్శన్, ఏజీ దాసు, విండోమాజీ చైర్మన్ గజవాడ జైపాల్, వీడీసీ కోశాధికారి తోట చిన్నసాయిలు, వారాల సాయిలు, ఆలయ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, దువ్వ నర్సింహులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ఒకరిపై కేసు

రెంజల్, ఫిబ్రవరి 22: తాడ్‌బిలోలి గ్రామంలో కల్లు దుకాణంలో దాడికి కారణమైన జూబేర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రవీందర్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి గ్రామంలోని కల్లుదుకాణంలో జూబేర్ అనే వ్యక్తి ఆర్టీసీ డ్రైవర్ గైని శ్రీనివాస్‌ను మద్యం పార్టీ ఇవ్వాలని కోరాడు. ఆర్టీసీ డ్రైవర్ నిరాకరించడంతో అతని ముఖంపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. గైని శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

నంబర్ ప్లేట్ లేకుండా నడిపితే కేసులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 22: బోధన్ పట్టణంలో గురువారం సాయంత్రం నుంచి కొత్త బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో పట్టణ సీఐ వీరయ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ద్విచక్రవాహనాలకు నంబర్ లేకుండా నడుపుతున్న ద్విచక్రవాహనాలను ఆపి వివరాలు సేకరించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో గురువారం ఎస్‌హెచ్‌వో రవికుమార్ వాహనాల తనిఖీ చేశారు. నంబరు ప్లేట్లు లేని వాహనాలకు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న మండల విద్యాధికారి ఆంధ్రయ్య

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 22 : విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శ్రేణి ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. హాసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో పలు తరగతి గదుల్లో ఏర్పాటుచేసిన ప్లాట్ పానల్ కంప్యూటర్ సిస్టమ్‌లను ఆయన ప్రారంభించారు. 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డీఎల్ఎన్. చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మోర్తాడ్, ఫిబ్రవరి22: ఇటీవల విశాఖపట్టణంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రణతి, అంజలిని లయన్స్ క్లబ్ మోర్తాడ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మనోహర్, గోపిడి సత్యనారాయణ, సామ శ్రీనివాస్, శ్రీనివాస్, ప్రవీణ్, వినోద్, రాజు, రాజన్న, రమేశ్, సంజీవ్, గిరిధర్, ప్రధానోపాధ్యాయుడు వినోద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

ఏర్గట్ల, ఫిబ్రవరి 22: మండల కేంద్రంతోపాటు తొర్తి, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. బాలింతలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భక్తులకు కొండంత అండ.. నల్లగుట్ట నర్సింహస్వామి

నేటి నుంచి మూడు రోజులపాటు ఆలయ వార్షికోత్సవం



స్వామి వారి ఆలయం, ఇన్‌సెట్‌లో విగ్రహం

ధర్పల్లి, ఫిబ్రవరి 22 : భక్తులకు కొండంత అండగా నిలుస్తున్నది ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామపరిధిలోని ధనం బండా తండా రోడ్డులో ఎత్తయిన నల్లరాతి కొండల్లో వెలసిన నల్లగుట్ట నర్సింహస్వామి ఆలయం. మహిమ గల దేవుడు లక్ష్మీనర్సింహస్వామిని వేడుకుంటే ఎలాంటి గండాలనా బాపుతాడని భక్తుల విశ్వాసం.

ఆలయ చరిత్ర..

దశాబ్దాల క్రితం ఓ బ్రాహ్మణుడికి స్వామివారు కలలో కనిపించి తన ప్రతి రూపంగా ఇక్కడ వెలిశానని చెప్పారు. ఆ బ్రాహ్మణుడు అక్కడికి వెళ్లి చూడగా.. దట్టమైన అటవీ ప్రాంతంలోని రాతిగుహలో స్వామివారి ప్రతిరూపం, పాదాలు కనిపించాయి. దీంతో స్వామివారిని అక్కడే నెలకొల్పి పూజలు చేస్తున్నారు. నల్లగుట్ట నర్సింహస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్నది. ఆలయ ఆవరణలో ఉన్న కోనేరు మహిమాన్వితమైందని, అందుకే అన్ని కాలాల్లోనూ కోనేటిలో పుష్కలంగా నీరు ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు.

నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు..

ఈనెల 23 నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు, జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్వామివారి పల్లకీసేవ, 24న పుణ్యాహవాహచనం, కల్యాణం, హోమం, అన్నదానం, 25న శోభాయాత్ర, జాతర నిర్వహించనున్నారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వీడీసీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ పెండ గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

సమ్మక్క-సారాలమ్మ జాతరకు నిజామాబాద్ నుంచి 270 బస్సులను వరంగల్‌కు పంపారు. దీంతో బస్టాండ్‌లో బస్సుల సంఖ్య తక్కువగా ఉండడం.. ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఉండడంతో బస్టాండ్ గురువారం కిక్కిరిసింది. బస్సు వస్తే చాలు ప్రయాణికులు సీట్ల కోసం ఎగబడడంతో గొడవలు కాకుండా పోలీసులు దగ్గరుండి బస్సు ఎక్కించారు. – నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

భాగ్యనగరంలో తప్పిపోయి.. ఏడాదిన్నర తర్వాత ఇంటికి..

ముజ్జు (మధ్యలో ఉన్న వ్యక్తి)ని కుటుంబీకులకు అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు

కోటగిరి, ఫిబ్రవరి 22: ఏడాది క్రితం తప్పిపోయిన మతిస్థిమితం లేని ఓ యువకుడు ఏడాదిన్నర తర్వాత తల్లిదండ్రుల చెంతకు చేరాడు. ఎత్తొండ మాజీ సర్పంచ్ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటగిరి మండలం ఎత్తొండకు చెందిన ముజ్జు అనే యువకుడు మతిస్థిమితం లేని కారణంగా ఏడాదిక్రితం హైదరాబాద్‌లో తప్పిపోయాడు. హైదరాబాద్‌లో రైలెక్కి ముంబైకి చేరుకోగా.. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దవాఖానలో చికిత్స పొందుతుండగా..యువకుడి మానసిక పరిస్థితిని తెలుసుకున్న వైద్యసిబ్బంది ముంబైలోని సీల్ ఆశ్రమానికి సమాచారమిచ్చారు. దీంతో ముజ్జును ఆశ్రమంలో చేర్పించగా..అతడి విషయం తెలుసుకున్న అక్కడే ఉన్న ఇందల్వాయి యువకులు కోటగిరి పోలీసులకు సమాచారం ఇచ్చి ఫొటోను పంపించారు. ఎస్సై సందీప్ గ్రామ మాజీ సర్పంచ్ ఆనంద్ ద్వారా ముజ్జు తండ్రి గౌసొద్దీన్‌కు చెప్పారు. ఈ మేరకు ముంబైలోని ఆశ్రమ అధ్యక్షుడు బిజ్జు ఫాదర్ సమక్షంలో గురువారం ముజ్జును తండ్రికి అప్పగించినట్లు తెలిపారు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు, కోటగిరి ఎస్సై సందీప్‌కు ముజ్జు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

మార్చి 5 నుంచి బీఎడ్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 : టీయూ పరిధిలో బీఎడ్ మూడో సంవత్సరం విద్యార్థులకు మార్చి 5 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల లేదా టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

బాండ్ పేపర్ బీజేపీని ఎవరూ నమ్మరు

ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 22 : బాండ్ పేపర్ బీజేపీని ఎవరూ నమ్మరని, బీజేపీలో నాయకత్వ లోపం స్పష్టం కనిపిస్తున్నదని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అర్వింద్ నాయకత్వ లోపంతోనే నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీగా చేర్చలేదని ఆరోపించారు. హామీలన్ని కేవలం బాండ్ పేపర్లకే పరిమితమని ఎద్దేవా చేశారు. అర్వింద్‌కు చిత్తశుద్ధి ఉంటే, రైతులకు న్యాయం చేయాలనుకుంటే ఇప్పటికే పసుపు బోర్డు రావాల్సిందని, ఎందుకు రాలేదని ప్రశ్నించారు. బీజేపీ ఎన్నికల స్టంట్‌ను ప్రజలు అర్థం చేసుకున్నారని, కులమతాల పేరిట రెచ్చగొట్టే బీజేపీకి ఓటమి తప్పదని అన్నారు. ప్రజలకు బాండ్ పేపర్ రాసిచ్చే నాయకులు అవసరం లేదని, పనులు చేసే నాయకులు కావాలని అన్నారు. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ లేకుంటే అర్వింద్‌కు రాజకీయ పుట్టుకనే లేదని ఎద్దేవా చేశారు.

రేపటి నుంచి టీసీసీ పరీక్షలు

కేంద్రాల వద్ద 144 సెక్షన్ : సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 22 : జిల్లా కేంద్రంలో ఈనెల 24 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ గురువారం తెలిపారు. డ్రాయింగ్ (లోయర్, హైయర్) పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, టైలరింగ్/ఎంబ్రాయిడింగ్ (లోయర్,హైయర్) పరీక్షలు ఉదయం 10 నుంచి ఒంటి గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగుతాయని వివరించారు. నగరంలోని హరిచరణ్ మార్వాడీ హిందీ మీడియం పాఠశాల, హరిచరణ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ఖిల్లా ప్రభుత్వ పాఠశాల, కసాబ్‌గల్లీలోని ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్‌ను కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద నిబంధనలు పక్కాగా అమలయ్యేలా బందోబస్తు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

నగర శివారులోని సారంగపూర్ ఆర్ఏసీసీ కొత్త ప్రాంగణంలో ఎస్‌బీఐ ప్రతినిధులు మహిళలకు కుట్టుమిషన్లు, దివ్యాంగులకు చక్రాల కుర్చీలను గురువారం అందజేశారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ నెట్‌వర్క్-1 మంజులశర్మ, డీజీఎం సూర్యకాంత్ దాస్, రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ వీటిని పంపిణీ చేశారు. దారుగల్లీ ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్‌ను అందజేశారు. – ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 22

నిత్యం రామనామాన్ని పఠించాలి

హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

నవీపేట్‌లో ప్రవచనాలు చేస్తున్న విద్యారణ్య భారతి స్వామి

రెంజల్/నవీపేట, ఫిబ్రవరి 22: ప్రతి హిందువూ కుటుంబంలో శ్రీరామనామాన్ని నిత్యం పఠనం చేయాలని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. రెంజల్ మండలం బాగేపల్లి గ్రామంలో నిర్మించిన అభీష్ట సీతారామచంద్రస్వామి, శివపంచాయతన, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి, మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణమహరాజ్ హాజరై పూజలు నిర్వహించారు. ఈనెల 20న ప్రారంభమైన ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ముగిశాయి. రామాలయాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నవీపేటలోని శివాజీనగర్‌లో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి, మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణస్వామి, లింగం గుట్ట సిద్ధేశ్వరా మహరాజు పాల్గొన్నారు. దేవత మూర్తులకు హంపీ పీఠాధిపతి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అన్నదానం చేశారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

ఎడపల్లి, ఫిబ్రవరి 22: జానకంపేట్ లక్ష్మీనారసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం లక్ష్మీ నరసింహ కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బాగేపల్లిలో పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతి స్వామి



జానకంపేట్‌లో లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం..

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

బోధన్/ నందిపేట్ / ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 22: రైతులపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు దహనం చేశారు. బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేశ్ మాట్లాడుతూ పంటలన్నింటికీ కనీస మద్దతు ధర కోసం చట్టం చేయాలంటూ ఢిల్లీకి ఆందోళనకు వెళ్లిన రైతులపై బీజేపీ ప్రభుత్వం కాల్పులు జరిపి ప్రాణాలు తీస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, జి.సీతారాం, ఇర్షాద్, శంకర్, బాలు, మోనాజీ, గణపతి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలో ఆందోళన చేసిన రైతులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ నందిపేట్ తహసీల్దార్‌కు ఏఐకేఎంఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆసంఘం నాయకులు కె.గంగాధర్, రాజలింగం పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలో హర్యానా, కేంద్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను ఏఐపీకేఎస్ దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులుప్రభాకర్, దేవారాం, కిషన్, ఆకుల గంగారాం, టి.గంగాధర్, ఇస్తారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో ఐఎఫ్‌టీయూ సమావేశం నిర్వహించారు. ఆసంఘం నాయకుడు భూమేశ్వర్ మాట్లాడుతూ రైతులపై కాల్పులు జరిపిన హర్యానా పోలీసులను వెంటనే అరెస్ట్ చేయాలని, రైతులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

పాల ఉత్పత్తిని పెంచుకోవాలి

మాక్లూర్, ఫిబ్రవరి 22: అమ్రాద్ గ్రామంలో గురువారం ఎస్‌బీఐ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో పాడి పరిశ్రమపై శిక్షణ నిర్వహించారు. డీఆర్డీవో సాయాగౌడ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో క్రాంతి, పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, ఎస్‌బీఐ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ వినయ్‌కుమార్, డీపీఎం రాచయ్య, ఓంకారు, కార్యదర్శి రాధిక, వైద్యులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమామసాహెర్ పాల్గొన్నారు.

ఏడాదికి రూ.లక్ష ఆదాయం పొందాలి

బాల్కొండ, ఫిబ్రవరి 22: ఏడాదికి రూ.లక్ష ఆదాయం పొందేలా మహిళా సంఘాలు ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఏపీడీ రవీందర్ అన్నారు. ఉమ్మడి మండలాల్లోని బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాలకు సంబంధించి లక్పతి దీదీ పథకంపై వీఏవోలకు శిక్షణ కార్యక్రమం బాల్కొండ మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఏపీడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి లోన్లను సమకూర్చి వారికి సంవత్సరంలో నెలకు 10వేల ఆదాయం, సంవత్సరంలో లక్ష రూపాయల ఆదాయం సంపాదించడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. డీపీఎం మారుతి, ఏపీఎంలు ప్రసాదరావు, రవికుమార్, విక్రమ్‌రెడ్డి, సీసీలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య

నవీపేట, ఫిబ్రవరి 22: బాసర గోదావరి నదిలో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కోటగల్లికి చెందిన రెడ్డి నవీన్‌రెడ్డి(35) కొన్ని నెలల నుంచి ఆనారోగ్యంతో బాధ పడుతున్నాడు. అనారోగ్య సమస్య అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడు. గురువారం గోదావరిలో మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఆర్ఎంపీ మృతి..

నవీపేట, ఫిబ్రవరి 22: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్ఎంపీ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బూస కిషన్(72) ఆభంగపట్నం గ్రామంలో కొన్నేండ్లుగా క్లీనిక్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 7 న సాయంత్రం నవీపేట నుంచి ఆభంగపట్నంలోని క్లీనిక్‌కు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఆభంగపట్నం గ్రామ బాసర రోడ్డుపై యూటర్న్ తీసుకుంటుండగా నిజామాబాద్ నుంచి బాసర వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన కిషన్‌ను నిజామాబాద్‌లోని ఓ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. మృతుడి పెద్ద కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నందిపేట యువకుడు..

నందిపేట్, ఫిబ్రవరి 22 : మండల కేంద్రానికి చెందిన అహ్మద్ (33) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అహ్మద్ రాజానగర్‌లో నాలుగు రోజుల క్రితం బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలోని దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో పారిశుద్ధ్య కార్మికుడు..

మోర్తాడ్, ఫిబ్రవరి22: వడ్యాట్ గ్రామంలో విద్యుదాఘాతంతో పారిశుద్ధ్యకార్మికుడు సైదు లింగన్న గురువారం మృతి చెందాడు. వడ్యాట్ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజు పోవడంతో మరమ్మతు చేసేందుకు వెళ్లిన లింగన్న విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అంత్యక్రియలకు జీపీ తరపున రూ.10వేలను ఎంపీవో శ్రీధర్, కార్యదర్శి గణేశ్ గురువారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

26 మంది స్టాఫ్ నర్సు పోస్టులు మంజూరు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి22: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ 100 పడకల దవాఖానకు 26 మంది స్టాఫ్ నర్సు పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని దవాఖాన సూపరింటెండెంట్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దవాఖానలో సిబ్బంది కొరత ఉందని ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి గతంలో వైద్యశాఖ మంత్రి రాజ నర్సింహకు జక్రాన్‌పల్లిలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈమేరకు ప్రభుత్వం మంజూరు చేసింది.

సిరికొండ సొసైటీ చైర్మన్‌గా గంగాధర్

డీసీవో శ్రీనివాస్‌రావుతో నూతన చైర్మన్ గంగాధర్, వైస్‌చైర్మన్ నర్సయ్య

సిరికొండ, ఫిబ్రవరి 22 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా చెల్లం గంగాధర్, వైస్ చైర్మన్‌గా సాయిరి నర్సయ్య ఎన్నికయ్యారు. ఇటీవల చైర్మన్ గంగారెడ్డి, వైస్‌చైర్మన్‌గా ప్రకాశ్‌పై సొసైటీ డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో వారు పదవిని కోల్పోగా.. నూతన చైర్మన్, వైస్‌చైర్మన్లు డీసీవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో గురువారం ప్రమాణస్వీకారం చేశారు.

సంక్షిప్తంగా..

- డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 : టీయూలోని సెంట్రల్ లైబ్రరీలో కాంపిటేటివ్ బుక్స్, ఫ్యాన్లు, ఎక్కువ వెలుతురు ఉండే లైట్లను ఏర్పాటు చేయాలని కోరుతూ టీయూ ఎన్ఎస్‌యూఐ నాయకులు టీయూ రిజిస్ట్రార్ యాదగిరికి గురువారం వినతిపత్రం అందజేశారు.
- డిచ్‌పల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని కమలాపురంలో ఉచిత పశువైద్య, గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పశుపోషణపై పాడిరైతులకు జిల్లా పశువైద్యాధికారి జగన్నాథాచారి అవగాహన కల్పించారు. 70 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసినట్లు మండ